




నీటి సమస్యపై నిరసన

మల్హర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : నీటిసమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని అన్‌సాన్‌పల్లిలో మహిళలు సోమవారం నిరసనకు దిగారు. గ్రామానికి నీటిని అందించే రెండు బోర్లు చెడిపోయి ఐదు నెలల గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు వస్తున్న అందరికీ సరిపడా అందడం లేదని తెలిపారు. ఐదు నెలల నుంచి నీటిని పొలాల వద్ద నుంచి తెచ్చుకుంటున్నామన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో పొలాల వద్దకు నీటి కోసం వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

‘అదనపు’



- కుంటుపడుతున్న విద్యా వ్యవస్థ
- హెచ్ఎం నుంచి డీఈవో వరకు ఇన్‌చార్జిలే..
- సర్కారు చదువులపై ప్రతికూల ప్రభావం
- పాఠశాలల్లో కొరవడిన పర్యవేక్షణ

ములుగు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఇన్‌చార్జి పాలనే కొనసాగుతోంది. హెడ్మాస్టర్ల నుంచి డీఈవో వరకు అదనపు బాధ్యతలే పోషిస్తున్నారు. ఆయా పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై ప్రతికూల ప్రభావం పడుతోంది. మొత్తం తొమ్మిది మండలాలకు ఎంఈవోలుగా హెడ్మాస్టర్లకు అదనపు బాధ్యతలు ఇచ్చి నియమించారు. గోవిందరావుపేట జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే 12 ప్రభుత్వ పాఠశాలల్లో హెడ్ మాస్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా ఆయా పాఠశాలల్లోని సీనియర్ టీచర్లు అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అంతటా ఇన్‌చార్జిలే ఉండటంతో వారు స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకొనే పరిస్థితులు లేకుండాపోతున్నాయని తెలుస్తోంది. తద్వారా జిల్లాలో విద్యావ్యవస్థ కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది.

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే.. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన కీలక అధికారులు డీఈవో, ఎంఈవోలను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించక పోవడంతో జిల్లాలో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోందనే విమర్శలు ఉత్పన్నమవుతున్నాయి. మిగతా జిల్లాలతో పోలిస్తే ములుగు చాలా వెనుకబడి ఉందని తెలుస్తోంది. ఇక్కడ ఆదివాసీ, గిరిజన ప్రజలు అధికంగా జీవిస్తుంటారు. ఇక్కడి విద్యార్థులను అన్నివిధాలా తీర్చిదిద్దాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతోపాటు సరైన సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి రెగ్యులర్ వారిని నియమించాల్సి ఉంది. అయితే.. ఇక్కడ జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు అంతా ఇన్‌చార్జిలు కావడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాలో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన, నూతన పాఠ్యాంశాల అమలులో జాప్యం, పర్యవేక్షణ లోపం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలుస్తోంది.

జిల్లాలో 353 పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 353 పాఠశాలలు ఉండగా ఇందులో 43 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 37,800 మంది విద్యను అభ్యసిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే.. జిల్లాలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేకపోవడంతో సీనియర్ ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలను అప్పగించారు. తొమ్మిది మండలాలకు మండల విద్యాశాఖ అధికారులు లేకపోవడంతో ఆయా మండలాల్లోని ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలను అప్పగించి నడిపిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన ఫణిని ఇటీవల ఏసీబీకి పట్టుబడడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. ఈ క్రమంలో విద్యాశాఖ ఉన్నత అధికారులు ఇక్కడే పనిచేస్తున్న ఇంటర్మీడి యెట్ నోడల్ అధికారికి అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో హెచ్ఎం స్థాయి నుంచి డీ ఈవో వరకు అదనపు బాధ్యతలను చేపట్టాల్సి వస్తోంది. పనిభారం పెరిగి ఏ పోస్టుకూ న్యాయం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రిన్స్‌పాల్‌కు మరో రెండు బాధ్యతలు

ములుగు జిల్లా విద్యాశాఖకు ఇన్‌చార్జి డీఈవోగా అదనపు బాధ్యతలు చేపట్టిన చంద్రకళ గోవిందరావుపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆమెను ఇంటర్మీడియెట్ నోడల్‌అధికారిగా కూడా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇక్కడ డీఈవోగా పనిచేసిన ఫణిని జూన్ 16న ఏసీబీకి చిక్కారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టు ఖాళీ అయింది. ఈ క్రమంలో ఉన్నతాధికారులు హనుమకొండ డీఈవో వాసంతిని ములుగు డీఈవోగా బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. అయితే.. ఆమె దీనికి విముఖత చూపినట్లు సమాచారం. దీంతో ఉన్నతాధికారులు ఇక్కడే ఇంటర్మీడియెట్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న చంద్రకళకు డీఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అయితే తను మూడు బాధ్యతలను చక్కదిద్దలేక ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

ఇన్‌చార్జి హెచ్ఎంలు ఉన్న పాఠశాలలు

ములుగు జిల్లాలోని జడ్పీహెచ్ఎస్ బండారుపల్లి, జడ్పీహెచ్ఎస్ ములుగు(బాయ్స్) , జడ్పీహెచ్ ఎస్ ములుగు (గర్ల్స్), జడ్పీహెచ్ ఎస్ అబ్బాపూర్, జడ్పీహెచ్ఎస్ భూపాల్‌నగర్, జడ్పీహెచ్ఎస్ కాటా పూర్, జడ్పీహెచ్ఎస్ బీరెల్లి, జడ్పీహెచ్ఎస్ గుర్రేవు ల, జడ్పీహెచ్ఎస్ ముప్పనపాలేటి, జడ్పీహెచ్ఎస్ తిమ్మంపేట్, జడ్పీ హెచ్ఎస్ నర్సింహసాగర్, జడ్పీ హెచ్ఎస్ రాజుపేట్ పాఠశాలలకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యులుగా సీనియర్ టీచర్లను నియమించారు. అయితే త్వరలో చేపట్టనున్న పదోన్నతుల్లో రెగ్యులర్ ప్రధా నోపాధ్యాయులను నియమిస్తారనే ఆశలు విద్యార్థుల్లో చిగురిస్తున్నాయి.

హెడ్‌మాస్టర్లే ఎంఈవోలు

జిల్లాలో హెడ్ మాస్టర్లే మండల విద్యాశా ఖ అధికారులుగా కొనసాగు తున్నారు. జడ్పీహెచ్ ఎస్ మల్లంపల్లి ప్రధానోపాధ్యాయుడు తిరుపతి ములు గు మండల విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్య తలను నిర్వరిస్తున్నారు. జడ్పీహెచ్ఎస్ పాలంపేట ప్రనోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రభాకర్ వెం కటాపూర్ ఎంఈవోగా అదపు బాధ్యతలను కొనసాగిస్తున్నారు. జడ్పీహెచ్ఎస్ గోవిందరావుపేట హెడ్ మాస్టర్‌గా పనిచేస్తున్న దివాకర్ అదే మండలానికి ఎంఈవోగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. జడ్పీహెచ్ ఎస్ రామన్నగూడెం ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య ఏటూరునాగారం మండల విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలను చేపడుతున్నారు. జడ్పీ హెచ్ ఎస్ ముప్పనపల్లి హెడ్‌మాస్టర్ శ్రీనివాసరావు కన్నాయిగూడెం ఎంఈవోగా పనిచేస్తున్నారు. జడ్పీహెచ్ఎస్ మంగపేట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న మేనక అదే మండలంలో మండల విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. ఎంపీ యూపీ ఎస్ ఆర్వీపురంలో విధులు నిర్వర్తిస్తున్న హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు వాజేడు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్నారు. జడ్పీహెచ్ఎస్ వెంకటాపురంలో హెచ్ఎం జీవీవీ సత్యనారాయణ వెంకటాపురం ఎంఈవోగా పనిచేస్తున్నారు.

రానున్న రెండు నెలలే కీలకం

రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లురెడ్డి



సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లురెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అంటువ్యాధుల నియంత్రణలో రానున్న రెండు నెలలే అత్యంత కీలకమని, వైద్య ఆరోగ్య శాఖ పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ వ్యాధుల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వాసం వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి వైద్యఆరోగ్యశాఖపై ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. వైద్యఆరోగ్యశాఖలో ఆశా కార్యకర్త నుంచి డీఎంహెచ్‌వో వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి బారిన పడిన వ్యక్తులను గుర్తించడమే కాకుండా ఫాలోఅప్ చేయడం అత్యంత కీలకం అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 200 వరకు మెడికల్ క్యాంపులు నిర్వహించమని, జ్వరం ప్రబలిన ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టామని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వంటి చర్యలను నిరంతరం కొనసాగించాలన్నారు. అంతకుముందు జీజీహెచ్‌ను తనిఖీ చేసిన వాసం వెంకటేశ్వర్లు రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉప సంచాలకుడు నాగరాజు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల మోటార్లు బంద్

కన్నాయిగూడెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులోని ఫేజ్-3లో పంపింగ్‌ను పూర్తిగా నిలిపి వేశారు. ఆదివారం వరకు ఫేజ్-1లో రెండు, ఫేజ్-2లో రెండు, ఫేజ్- 3లో నాలుగు.. ఇలా మొత్తం ఎనిమిది మోటార్ల ద్వారా 2014 క్యూసెక్కుల నీటిని అధికారులు ఎత్తిపోశారు. సోమవారం ఉదయానికి ఫేజ్-3లో ఒక మోటారును నిలిపివేశారు. సాయంత్రానికి ఫేజ్-3లో ఉన్న మరో మూడు మోటారులను ఆఫ్ చేసి పంపింగ్‌ను పూర్తిగా నిలిపి వేశారు. మొత్తం నాలుగు మోటార్ల ద్వారా భూపాలపల్లి జిల్లా భీమనపూర్ రిజర్వాయర్‌కు 848 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద నీటిమట్టం 75.60 మీటర్లు నమోదైంది.

కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

- 27 మంది విద్యార్థినులకు అస్వస్థత
- పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయలక్ష్మి
- సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కారణమని ఆగ్రహం
- విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర



చిట్యాల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

భూపాలపల్లిటౌన్/చిట్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాలలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు, బాధిత బాలికల కథనం ప్రకారం.. కేజీబీవీలో 246 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. సోమవారం ఉదయం కిచిడీ తిన్న విదార్థినుల్లో 27 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో హాస్టల్ సిబ్బంది విషయం బయటికి పొక్కకుండా ఆ విద్యార్థినులను 108 సహాయంతో సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చిట్యాలలోని సామాజిక ఆస్పత్రికి (మిగతా 8వ పేజీలో)



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

మేడిగడ్డ బ్యారేజీకి 1.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 1.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 2.60 మీటర్లు ఎత్తులో ప్రవహిస్తోంది.

కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయాలి..

- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద పుష్కలంగా నీళ్లు
- అయినా మోటార్లు ఆన్ చేయడం లేదు..
- ఎన్‌డీఎస్‌ఏ అనుమతి ఉన్నా ఎందుకు పట్టించుకోరు?
- రైతుల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ సర్కారు
- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నేతల ఫైర్

మహదేవపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్) అనుమతులు ఉన్నా కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఎందుకు ఆన్ చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్ల పుష్కలంగా ఉన్నా రైతులకు సాగునీరు అందించకపోవడం దారుణమని దుయ్యబట్టారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కరీంనగర్, వరంగల్ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ముట్టడికి యత్నించాయి.



బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు ఆధ్వరంలో ఈ నిరసన కార్యక్రమం జరగ్గా ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, విద్యాసాగర్‌రావు, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, సుంకె రవిశంకర్, దివాకర్‌రావు, మాజీ జడ్పీచైర్మన్ జక్కు శ్రీహర్షిణి తదితరులు కాళేశ్వరం చేరుకున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ముట్టడికి భారీ శ్రేణులతో కలిసి బయల్దేరారు. డీఎస్పీ సూర్యనారాయణ నేతృత్వంలో అప్పటికే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. పంప్‌హౌస్‌లోకి బీఆర్ఎస్ నేతలు చొచ్చుకురాగా పోలీసులు వారిని నిలువరించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నేతలు పంప్‌హౌస్ ఎదుట బైఠాయించారు. ఈ నిరసన రెండు గంటలపాటు జరిగింది.



కన్నెపల్లి పంప్‌హౌజ్ గేట్ వద్ద బైఠాయించిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ వద్ద గల కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ‘సీఎం డౌన్ డౌన్’ అని నినాదాలు చేశారు. గోదావరి వద్ద నీటి ఉధృతి అధికంగా ఉందని, రోజుకు రెండు టీఎంసీల లభ్యత ఉందని, దీన్ని ఎత్తిపోయాలని అన్నారు. సరిపడా సాగునీరు ఉన్నా విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. పొలాలు ఎండిపోతుంటే హైదరాబాద్‌లో కూర్చొని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ముచ్చట్లు చెబుతున్నారని మండిపడ్డారు.

ఎన్‌డీఎస్‌ఏ అనుమతి ఉంది కదా?

వారం రోజుల్లోగా నీటిని విడుదల చేసి (మిగతా 8వ పేజీలో)

విద్యుత్ స్తంభం ఎక్కిన పాము

- షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం
- సుమారు రూ. 50 లక్షల నష్టం

టేకుమట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై నాగు పాము ఎక్కడంతో షార్ట్ సర్క్యూట్ అయి వస్త్ర దుకాణం దగ్ధమైన సంఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దుకాణం యజమాని గడదాసి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌కు చెందిన వస్త్ర దుకాణం నుంచి అర్ధరాత్రి సమయంలో ఏదో కాలుతున్న వాసనతో పాటు పొగలు రావడంతో ఆయన దగ్గరికి వెళ్లి చూశాడు. అప్పటికే షాప్ మొత్తం పొగతో నిండిపోయి లోనికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పోలీసులకు ఆయన సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి వారు చేరుకొని షాప్ షెట్టర్‌ను యంత్రాల సహాయంతో తొలగించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే షాపులోని బట్టలు, కౌంటర్, ర్యాకులన్నీ కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. తీరా సోమవారం ఉదయం బాధితులు శ్రీనివాస్ పక్కనే ఉన్న విద్యుత్ పోల్‌ను పరిశీలించగా చనిపోయిన నాగుపాము కనిపించింది. పాము స్తంభం ఎక్కడం వల్లే షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి అగ్ని ప్రమాదం జరిగిందని ఆయన గుర్తించాడు. అగ్ని ప్రమాదానికి గురైన షాపును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించి బాధితుడు శ్రీనివాస్‌ను పరామర్శించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రుణ సౌకర్యం కల్పిస్తామని కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో రూ. 30 లక్షల విలువ చేసే బట్టలు, ఇతర సామగ్రి, రూ. 20 లక్షల నగదు దగ్ధమైనట్టు బాధితుడు శ్రీనివాస్ తెలిపాడు.



అగ్నిప్రమాదంలో కాలిపోయిన బట్టలు

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

చిట్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా.. వంటలు రుచికరంగా ఉంటున్నాయాణ అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫోన్ మిత్ర ద్వారా గురుకులాల రాష్ట్ర కార్యాలయానికి ఫోన్ చేసి మాట్లాడారు. తరగతి గదుల్లోని విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రూ.20లక్షలతో గురుకుల పాఠశాలలో సెంట్రల్ లైటింగ్, మినరల్ వాటర్ ప్లాంట్, బోరు మోటార్, వంట గది, మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేయించామన్నారు. డైనింగ్ హాల్ పెయింటింగ్, క్రీడా ప్రాంగణ పరిశుభ్రత, సమావేశం వేదిక కోసం మరిన్ని నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యారంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో రూ.75 ఉన్న కాస్మొటిక్ చార్జీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.190తో పాటు వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతికి సూచించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ, జిల్లా నాయకులు చిలుకల రాయకొంరు, గంగాధరి రవీందర్, యూత్ టౌన్ అధ్యక్షుడు అల్లం రాజు తదితరులు ఉన్నారు.



చిట్యాల గురుకుల విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

మానుకోటలో యువకుడి దారుణహత్య


హత్యకు గురైన ప్రభాకర్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మహబూబాబాద్ పట్టణంలోని లెనిన్ నగర్ కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. టౌన్ ఇన్‌చార్జి సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్ కాలనీకి చెందిన తూళ్ల ప్రభాకర్(35) అనే యువకుడు వీధుల్లో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరి విక్రయించుకుంటూ కాలనీలో ఇంటింటా తిరుగుతూ ఆహారం అడుక్కొని తింటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి లెనిన్‌నగర్ కాలనీలో ఆరుబయట నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో తలపై కొట్టడంతో రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ప్రభాకర్ స్నేహితుడు సంపతి శ్రీనుపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి బావ వనగాళ్ల గుట్టయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

12 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చిన్నగూడూరు, ఆగస్టు 4 : అక్రమంగా తరలిస్తున్న 12 కిలోల ఎండు గంజాయిని సోమవారం చిన్నగూడూరు పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేశారు. వారి వద్ద నుంచి 12 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సుమన్, సాయి, రమేశ్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రిమాండ్ తరలించినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నీటితొట్టిలో పడి బాలిక మృతి

పెద్దతండాలో ఘటన


తన్విశ్రీ (ఫైల్)

జూలూరుపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటితొట్టిలో పడి మండలంలోని మాచినేనిపేటతండా పంచాయతీ పరిధి పెద్దతండా గ్రామానికి చెందిన రెండున్నర ఏళ్ల బాలిక భూక్యా తన్విశ్రీ మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దతండా గ్రామానికి చెందిన సరస్వతికి కొన్నేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన భూక్యా గోపనాయక్‌తో వివాహం జరిగింది. ఈ దంపతులకు రెండున్నర ఏళ్ల కూతురు తన్విశ్రీ, 8నెలల బాబు తన్విష్ ఉన్నారు. కాగా వీరు పెద్దతండా గ్రామంలోనే ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఉండే ఇంటి సమీపంలోనే బాలిక అమ్మమ్మ జ్యోతి ఇల్లు ఉంది. ఈ క్రమంలోనే తల్లి సరస్వతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని పక్కన ఉన్న తల్లి జ్యోతి వాళ్ల ఇంటికి వెళ్లింది.

అక్కడికి బంధువులు రాగా వారితో తల్లి మాట్లాడుతూ ఉంది. ఈ క్రమంలో బాలిక ఆడుకుంటూ వెళ్లి అమ్మమ్మ ఇంటి ఆవరణలో ఉన్న నీటి తొట్టిలో పడింది. తన కూతురు కనిపించకపోవడంతో తల్లి సరస్వతి, బంధువులు ఆందోళన చెంది ఆమె కోసం వెతికారు. ఎక్కడ కనిపించకపోవటంతో నీటి తొట్టి వద్దకు వెళ్లి చూడగా బాలిక దానిలో ఉంది. బయటకు తీసి వైద్య చికిత్సలు అందించేందుకు జూలూరుపాడులోని ప్రైవేట్ ఆసుపత్రికి ఆమెను తీసుకువచ్చారు. వైద్యుడు ఆమెను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలిక మృతితో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పొంగుతున్న పాకాల వాగు

- చెక్‌డ్యామ్‌పై నుంచి ప్రవహిస్తున్న ఆకేరు
- గూడూరు, దంతాలపల్లిలో భారీ వర్షం
- జిల్లాలో 36.4 మిల్లీమీటర్ల వర్షపాతం


కేసముద్రం మండలం నారాయణపురంలో నీట మునిగిన పంట పొలాలు


గూడూరు మండలంలో పొంగుతున్న పాకాల వాగు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు వానదేవుడు కరుణించాడు.. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో రైతన్నలు ఆనందంతో ఉన్నారు. మొక్కలు వాడిపోయే స్థితికి చేరుకున్న సమయంలో రాత్రి కురిసిన వాన మొక్కలకు ఊపిరి పోసినట్లయింది. పాకాల వాగు పొంగి ప్రవహిస్తోంది. ఆకేరువాగు చెక్‌డ్యామ్‌పై నుంచి ప్రవహిస్తోంది. గూడూరు మండలంలో రాత్రి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దాంతో పాకాల వాగు బ్రిడ్జికి ఆనుకుని వరద ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల్లోని చెరువులు మత్తడి పోస్తున్నాయి. నర్సింహులపేట మండలంలోని కౌసల్యదేవిపల్లి శివారులో ఉన్న ఆకేరువాగు లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మత్తడి ప్రవహిస్తోంది. నెల్లికుదురు మండలం కొమ్ములవంచ వద్ద నున్న కొత్త చెరువు అలుగు పోస్తుండడంతో పక్కనే ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దాంతో నెల్లికుదురు, కొమ్ములవంచ గ్రామాల మధ్య కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం 10 గంటలకు మత్తడి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు కొనసాగాయి. దంతాలపల్లిలో భారీ వర్షం కురిసింది. కేసముద్రం మండలం నారాయణపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతుండగా కుంటలోకి నీరు పోయేందుకు కల్వర్టు కట్టకపోవడంతో వర్షం నీరు భారీగా నిలిచిపోయి 30 ఎకరాల్లో నాట్లు వేసిన చుట్టుపక్కల పొలాలు నీట మునిగాయి.. దీంతో ఈ విషయంపై గ్రామ రైతులు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. కోమటిపల్లి శివారులో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుండగా కల్వర్టు చిన్నగా కట్టడంతో వరద నీరు వెళ్లకుండ నిలిచి 20 ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి. రైతులు ఏకమై జేసీబీ తీసుకువచ్చి కల్వర్టు కింద కాల్వను తవ్వడంతో వరదనీరు పోయింది. కొత్తగూడ, తొర్రూరు, నెలికుదురు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది.

జిల్లాలో సగటున 36.4 మిల్లీమీటర్ల వర్షపాతం..

జిల్లాలో 582.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 36.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గూడూరులో 108.0, దంతాలపల్లిలో 107.2, కొత్తగూడలో 46.6, గంగారంలో 30.4, బయ్యారంలో 9.0, గార్లలో 3.8, డోర్నకల్‌లో 4.6, కురవిలో 15.2, మహబూబాబాద్‌లో 9.2, కేసముద్రంలో 44.8, నెల్లికుదురులో 60.4, నర్సింహులపేటలో 35.0, చిన్నగూడూరులో 18.6, మరిపెడలో 4.6, తొర్రూరులో 56.8, పెద్దవంగరలో 28.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

యూరియా కావాలంటే గులికలు కొనాల్సిందే..

అవసరం లేకున్నా అంటగడుతున్న మన గ్రోమోర్ యజమానులు

ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటున్న రైతులు



కొత్తగూడలోని మన గ్రోమోర్ కేంద్రం

కొత్తగూడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా కావాలంటే గుళికలు కొనాల్సిందే.. అవసరం లేకున్నా వాటిని మన గ్రోమోర్ యాజమానులు అంటకడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రమేయంతో కొనాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నదాతులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని గాంధీనగర్‌లోని మన గ్రోమోర్‌లో జరుగుతున్న అక్రమాలపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని మన గ్రోమోర్ యజమానులు ఇదే అదునుగా కొత్త వ్యాపారానికి తెరలేపారు. యూరియా కావాలంటే గుళికలు కొనాల్సిందేనని హుకుం జారీ చేశారు. విసుగు చెందిన రైతులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఏవో ఉదయ్ స్పందించారు. అలాంటిదేమిలేదని ఉంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఒక్కో ఆధార్ కార్డు మీద 4 నుంచి 5 యూరియా బస్తాలు ఇవ్వాల్సి ఉండగా మన గ్రోమోర్‌లో కేవలం ఒక్క బస్తా ఇస్తూ గుళికలు అంటగడుతున్నారు. యూరియా బస్తా రూ. 253 ఉండగా గుళికలకు రూ. 714 వసూలు చేస్తున్నారు. తమకు అవసరం లేదని రైతులు చెబుతున్నా షాపు నిర్వాహకులు అంటగడుతున్నారని షైలారం గ్రామానికి చెందిన అంగోత్ భద్రు ఆరోపించారు. మన గ్రోమోర్‌లో జరుగుతున్న అక్రమాలతో పాటు మండలంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్ దుకాణాల్లో అక్రమాలకు పాల్పడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


పదోన్నతి పొందిన ఎస్సైలను అభినందిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

ఏఎస్సైలకు ఎస్సైగా పదోన్నతి

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తించిన నలుగురు ఏఎస్సైలకు ఎస్సైగా పదోన్నతి పొందారు. వీరిలో 1989 బ్యాచ్‌కు చెందిన వి. రాజు, వి. విజయ్‌కుమార్, 1987 బ్యాచ్‌కు చెందిన సీహెచ్ సాంబయ్య, బి. రాజమౌళి ఉన్నారు. సోమవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. పని విధానం ప్రకారమే సమాజంలో గౌరవ మర్యాదలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు ఉన్నారు.

కోతుల దాడిలో పలువురికి గాయాలు

డోర్నకల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మండలం బంకట్‌సింగ్‌తండాలో సోమవారం కోతులు ప్రజలపై దాడి చేసి పలువురిని గాయపరిచాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సుమారు 30 నిమిషాల పాటు కోతులు నానా భీభత్సం సృష్టించడంతో తండా వాసులు హడలిపోయారు. కోతుల దాడిలో గాయపడిన బానోత్ కోమటితో పాటు మరికొంత మందిని డోర్నకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కోతుల వల్ల ప్రజలను గాయపరచడమే కాకుండా తమ పంటలు కూడా ధ్వంసం చేస్తున్నాయని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

గ్రామీణాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం


గోవిందరావుపేటలో మహిళకు కరపత్రం అందజేస్తున్న నాయకులు

గణపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ పాలనతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డితో కలిసి కోటగుళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో పర్యటించి మొక్కలు నాటారు ఒక మొక్కకు అటల్ బీహారీ వాజ్‌పేయ్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ 'బీజేపీ- ప్రతి ఇంటికీ పోలింగ్ బూత్ అధ్యక్షుడు' అనే కార్యక్రమం గ్రామ స్థాయిలో బీజేపీ బలాన్ని చేకూరేలా ఒక కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రావు, కళాశాల విభాగం అధ్యక్షుడు మంద మహేష్, నాయకులు భద్రయ్య, పున్నం చందర్, రాణి, సమ్మయ్య, సంపత్, రమేష్, మొగిలి, శ్రీకాంత్, హరిలాల్, తిరుపతి, సతీష్, సంతోష్ పాల్గొన్నారు.

● గోవిందరావుపేట: మండలంలోని పస్రా 71వ పోలింగ్‌కేంద్రం బూత్ పరిధిలో భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఇంటింటికి తిరుగుతూ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ప్రజలకు కరపత్రాలు అందజేసి కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరిస్తూ స్వయం ఉపాధి పథకాల ద్వారా యువత ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో తక్కళ్లపల్లి దేవేందర్ రావు, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, కర్ర సాంబశివరెడ్డి, రాజన్న, మేరుగు సత్యనారాయణ, ఏదునూరి రమేష్, ఆకుల రవీందర్ పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి


ఏపీవో వసంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ గోండ్వాన సంక్షేమ పరిషత్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సొంది వీరయ్య సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏలో ఏపీవో వసంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీప్రాంత ఆదివాసీ బిడ్డలు విద్యారంగంలో ముందుకు రాణించేందుకు న్యాయ కళాశాల మేలు చేస్తుందని అన్నారు. ఇందు కోసం ప్రభుత్వం భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ.. మినీ బస్సు బోల్తా

ఒకరి మృతి, 10 మందికి తీవ్రగాయాలు

నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఘటన

మానుకోటలో విషాదం




నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలో బోల్తా పడిన మినీ బస్సు, మృతి చెందిన మంగీలాల్ (ఫైల్), ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాము

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్‌కు బయలుదేరిన మినీ బస్సు అదుపుతప్పి బోల్తా పడ్డ ఘటనలో ఒకరు మృతి చెందగా, 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు బాబునాయక్, వినాయక తండాకు చెందిన 20 మంది తాపీమేస్త్రీలు స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 2న ట్రావెల్స్ మినీ బస్సులో మహబూబాబాద్ పట్టణం నుంచి ఏపీ శ్రీశైలం పుణ్యక్షేత్రంకు వెళ్లారు. 3న ఆదివారం ఉదయం మల్లికార్జునస్వామి దైవదర్శనం పూర్తి చేసుకున్నారు. స్నేహితులంతా కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అదేరోజు రాత్రి తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్‌కు బయలుదేరారు. నల్గొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని మాధాపురం వద్ద వారు ప్రయాణిస్తున్న మినీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వినాయకతండాకు చెందిన బానోతు మంగీలాల్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. భూక్య రాము, బానోతు లాలుకు, బానోతు రమేష్, వీరన్న, వెంకన్నలకు కాళ్లు చేతులు విరగగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రులను స్థానిక నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న తెలిపారు.

విషాదం నింపిన స్నేహితుల దినోత్సవం

స్నేహితుల దినోత్సవం తాపీమేస్త్రీల కుటుంబాల్లో విషాదం నింపింది. మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూ సెంటర్ అడ్డాకు చెందిన తాపీమేస్త్రీలుగా పని చేస్తున్న 20 మంది స్నేహితులు విహారయాత్రకు వెళ్లారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి దైవ క్షేత్రంలో సన్నిధిలో స్నేహితులందరూ కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం మల్లికార్జున స్వామి దైవ దర్శనం అనంతరం ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్‌కు బయలుదేరిన కొద్దిగంటల వ్యవధిలోనే వారు ప్రయాణిస్తున్న మినీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. మంగీలాల్ మృతి చెందగా మరో పది మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీపీఎంవో సత్యనారాయణ అన్నారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామాంజపురం గ్రామంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా ఆయన గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నలుగురు జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులబారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాన్నారు. హెచ్‌వో కోటిరెడ్డి, సిబ్బంది కృష్ణకుమారి, లక్ష్మి, రాంబాబు, ఆశాలు రజని, గంగాభవాని, భద్రమ్మ, పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దయాకర్‌రావు

కార్యకర్తలను కాపాడుకుంటా..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఆగష్టు 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో పాము కమలమ్మ (85) మరణించగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం మృతుల కుటంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ మృతుడి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, పోలకొండ కృష్ణమూర్తి, మాజీ ఉపసర్పంచ్ అశోక్, కొమురయ్య, సోమనర్సయ్య, దయాకర్, శ్రీకాంత్, రమేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


శ్వాస ఆగిన శిశువుకు ఊపిరి అందించిన వైద్యులు

డాల్ఫిన్ ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స

వరంగల్ మెడికల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చాలాకాలం తరువాత సంతానం కలిసిన దంపతులకు పుట్టిన శిశువుకు శ్వాస అందించి ప్రాణాలు కాపాడినట్లు డాల్ఫిన్ ఆస్పత్రి వైద్యులు ప్రవీణ్ తెలిపారు. సంగెం మండలం గాడిపల్లి గ్రామానికి చెందిన ప్రవళిక, మహేశ్ దంపతులకు 8 సంవత్సరాల అనంతరం సంతాన కలిగినట్లు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఇద్దరు కవల పిల్లలు ఉండటంతో ఫీటర్ స్కాన్ చేయగా ఒకరికి కాంజినేటల్ డయాఫ్రమేటిక్ హెర్నియా ఉన్నట్లు గుర్తించామన్నారు. వరంగల్ క్యూర్ వెల్ ఆస్పత్రిలో ప్రసవించగా ఒక శిశువును డాల్ఫిన్ ఆస్పత్రికి పంపించారు. ఆ శిశువు కిలో 600 గ్రాములతో జన్మించగా ఊపిరితిత్తుల్లో పేగులు అడ్డుపడడంతో శ్వాస కూడా తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో తగిన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ప్రవీణ్‌తోపాటు డాక్టర్లు సిద్దార్థరెడ్డి, సురేశ్ పాల్గొన్నారు. మగ శిశువును రక్షించడంతో దంపతులిద్దరు ఆనందం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న వైద్యుడు ప్రవీణ్



వస్తున్నాం కాచుకోండి..

- అపరిశుభ్ర జనావాసాల్లో తిష్ఠ వేస్తాం
- ఎవరినైనా సరే పీల్చి పిప్పి చేస్తాం
- అధికార యంత్రాంగం ఉత్తుత్తి చర్యలు మమ్మల్ని ఏమీ చేయలేవు
- శుచీ, శుభ్రత ఉంటే ఆవైపు రానే రాం...

వర్షాకాలం వేళ దోమల సవాల్

పల్లె మాదే.. పట్నంలో గల్లీ మాదే.. అక్కడా ఉంటాం.. ఇక్కడా ఉంటాం.. ఒక్కరమో ఇద్దరమో కాదు, వేలు.. లక్షల్లో కదిలి దండుగా వచ్చేస్తాం.. మేమెవరిమో తెలుసా..? జనాల రక్తాన్ని పీల్చి పిప్పిచేసే దోమలం.. అంతా శుభ్రంగా ఉంటే మేమెందుకు బాగుంటాం.. ఎక్కడ మురుగు ఉంటే అక్కడే వాలిపోతాం.. ఓపెన్ ప్లాట్లు మురుగునీటి గుంతలు.. డ్రెయినేజీలే మా స్థావరాలు.. అక్కడే దినదిన ప్రవర్ధమానమవుతాం.. మీకు చేతనైతే మమ్మల్ని కట్టడి చేయండి చూద్దాం.. యుద్ధం నీదా.. నాదా.. సై.

రోగాలు దాసోహం..

మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు ఇలా చెప్పుకుంటూ పోతే వ్యాధుల జాబితాలోని రోగాలన్నీ మాకు దాసోహమే.. మేం ఎక్కడ సంచరిస్తే రోగాలు అక్కడే ప్రజ్వరిల్లుతాయి. మమ్మల్ని అంతమొందించేందుకు ప్రభుత్వం, అధికారులు వారోత్సవాలు పక్షోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తారు.. రూ. కోట్ల కొద్దీ బడ్జెట్‌ను కేటాయించి ఖర్చులు చేస్తారు.. కానీ మమ్మల్ని అవేమీ చేయలేవు.

ఇంటింటా ప్రత్యేక బడ్జెట్..

మమ్మల్ని నాశనం చేసేందుకు సర్కారు చర్యలకు అదనంగా ఇంటింటా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించకుంటున్నారు. జనగామ జిల్లానే తీసుకుంటే 2011 జనాభా లెక్కల ప్రకారం 5,66,376 మంది జనాభా ఉన్నారు. వారిలో 2,83,648 మంది పురుషులు, 2,82,728 మంది మహిళలు, 55056 మంది చిన్నారులు ఉన్నారు.. పిల్లా జెల్లా.. ముసలి ముతక అంతా కలిసి ప్రస్తుత జనాభా 7 లక్షల పైచిలుకే ఉంటుందని మేమనుకుంటున్నాం.. అందులో 5 లక్షల పైచిలుకు గ్రామీణ జనాభా అయితే రెండు లక్షల దాకా పట్టణ జనాభా. మొత్తంగా సుమారు రెండు లక్షల గృహాలు ఉంటాయని మేమంతా అంచనాకు వచ్చేశాం. వీరంతా కలిసి ఎవరికి వారు.. విడివిడిగా మా కోసం నెలవారీగా ప్రత్యేక బడ్జెట్ కేటాయించుకుంటున్నారు.. ఎందుకంటే.. మస్కిటో కాయిల్స్, ఎలక్ట్రిక్ బ్యాట్లు కొనుగోలు చేసుకుంటున్నారు.. పాపం వాళ్లకేం తెలుసు.. ఇళ్లంతా శుచి.. శుభ్రంగా ఉంచుకుంటే మేమెందుకు వస్తాం.. డెట్టాల్, బ్లీచింగ్‌ను వాడితే చాలు అటు వైపు కన్నెత్తి కాదుగదా.. ఆ ప్రాంతం జోలికే వెళ్లబోం.

మీ నిర్లక్ష్యమే.. మాకు సుభిక్షం..



పట్టణాలు, పల్లెలు, గల్లీలు, తండాలు అనే తేడా లేకుండా పెద్ద పెద్ద డ్రైనేజీలు, మురుగునీటి గుంతలు, ఇళ్ల మధ్య నిలిచే మురుగునీటి స్థావరాలే మా రాజభోగాలకు విలాసాలు.. మమ్మల్ని తన్ని తరిమేందుకు పారిశుధ్య సైనికులు మునిసిపాలిటీ, గ్రామపంచాయతీల్లో వందలాది మంది ఉన్నారు.. అయినా మమ్మల్నేం చేయలేరు.. మమ్మల్ని సంహరించేందుకు రూ. కోట్లల్లో ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.. వాటిని సజావుగా వినియోగించేందుకు పెద్ద పెద్ద సార్లు రోజూ మీటింగ్‌లు పెట్టి సమీక్షిస్తారు.. అంతకుమించి మమ్మల్నేం చేయగలరు చెప్పండి.. కలెక్టర్ సార్ హుకుం జారీ చేయడం.. కింది సార్లు తలలూపడం.. ఆ కింది వాళ్లు పారిశుధ్య చేయించినట్లు ఫోటోలు దిగడం.. ఇది చాలదా మా సామ్రాజ్య విస్తరణకు అవకాశం. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం నిరంతరం నిండుకుండలా ఉండటం సహజమే. అదే సుభిక్షమై వర్ధిల్లడం మాకు సునాయసమే.


పనిచేయని ఫాగింగ్ మిషన్లు..

మమ్మల్ని అంతం చేయడమే లక్ష్యంగా నాలుగేళ్ల క్రితం గ్రామపంచాయతీ అధికారులు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. అవి సరిగ్గా పనిచేస్తే కదా.. మా భరతం పట్టేది. ఫాగింగ్ మిషన్ల పప్పులు మా వద్ద ఏమీ ఉడకవు.. చాలా గ్రామాల్లో మిషన్లు పాడైపోయి స్టోర్ రూంలో మూలుగుతున్నాయి. మా లార్వాలను నాశనం చేసేందుకు ప్రతీ సీజన్‌లో ఆయిల్‌బాల్స్, డ్రైనేజీల్లో మందులను పిచికారి చేయాలని అధికారులు ప్రణాళికలను రచిస్తుంటారు. చూద్దాం.. మమ్మల్ని అవేం చేయగలవో. జనాలపై మా ఆపరేషన్ పూర్తయ్యాక అధికారులు మాపై ఆపరేషన్ షురూ చేస్తారు గదా, అప్పటికి జనాలకు జరిగే నష్టం ఎంచక్కా జరిగిపోవడం ఖాయం. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై, మురుగునీటి గుంతల్లో నీళ్లు నిలిచాయి.. అక్కడే మేమంతా మకాం వేస్తాం.. మా సంతతిని వృద్ధి చేస్తాం.. ఆఫీసర్ ఎవరో.. సామాన్యులు ఎవరో మాకేం తెలుసు.. మాకంతా సమానమే.. కాచుకోండి మమ్మల్నెవరూ అడ్డుకోలేరు.

ఇట్లు
దోమల దండు

- ఆంధ్రజ్యోతి, లింగాలఘణపురం

తల్లిపాలు.. ఎంతో మేలు!



- నామమాత్రంగా సాగుతున్న వారోత్సవాలు
- తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం
- పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో కానరాని సమావేశాలు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు పడితే.. బిడ్డతో పాటు తల్లికి కూడా ఆరోగ్యకరమే. తల్లిపా విశిష్టతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీయేటా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఏడు రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టి బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించాల్సి ఉండగా జిల్లాలో క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు జరగడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

అడపాదడపా కార్యక్రమాలు..

తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుటకు రాష్ట్ర ప్రభుత్వం ఏడు రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రతీ యేటా శ్రీకారం చుడుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలు జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాల్సి ఉండగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని సెక్టార్ పరిధిలో అంతా ఒకే చోట నామమాత్రపు కార్యక్రమాలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. అంగన్‌వాడీ టీచర్లతో పాటు ఆశాలు, ఏఎన్ఎంలు, మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి గృహ సందర్శన చేయాలనే నిబంధన ఉంది. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం సైతం చేపట్టాలి. కానీ, అవేమి జిల్లాలో కానరావడం లేదు.

లోపిస్తున్న సమన్వయం..

తల్లిపాల ప్రాముఖ్యత కీలకమైన కార్యక్రమంగానే చెప్పుకోవచ్చు. ఎందుకంటే పుట్టిన బిడ్డకు తల్లి తన పాలు పట్టించవచ్చా.. లేదా అనే సందేహాలు తల్లుల్లో వారి కుటుంబీకుల్లో నెలకొని ఉంటాయి. కానీ, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించడాన్ని ముర్రుపాలు అంటారు. ఆ ముర్రుపాలు పట్టిస్తే పుట్టిన బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మహిళా స్త్రీశిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ (డీఆర్‌డీఏ), వైద్యఆరోగ్యశాఖ, ప్రైవేటు ఆసుపత్రుల నెట్‌వర్క్, మహిళలు, పిల్లల కోసం పని చేసే ఎన్‌జీఓలను భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. వీరిందరితో తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపేలా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రచారం చేపట్టాలనే నిబంధన ప్రభుత్వం ద్వారా ఆర్‌జేడీ కార్యాలయం నుండి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ, ఈ శాఖల్లో సమన్వయం లోపం కొట్టిచ్చినట్లుగా కానవస్తోంది.

అంతటా ఇదే తంతూ..?

జిల్లా వ్యాప్తంగా భూపాలపల్లి, మహదేవపూర్ రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు కలుపుకొని 644 అంగన్‌వాడీ సెంటర్లు నడుస్తున్నాయి. వీటన్నింట్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఎక్కడా కార్యక్రమాలేవి నిర్వహించిన దాఖలాలు మాత్రం కానరావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే అది కూడా సెక్టార్ పరిధిల్లోని మూడు, నాలుగు సెంటర్లు కలుపుకొని కార్యక్రమం చేపడుతూ ఉన్నతాధికారులకు ఫోటోలు పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ డీమ్డ్ యూనివర్సిటీలు, కాలేజీలు

నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు



మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసిన వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు చక్రపాణి, సుదర్శన్

హనుమకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేటు మెడికల్ యూనివర్సిటీల ఏర్పాటుపై వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్ సోమవారం ఢిల్లీలో నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా, లోపభూయిష్ట విధానాలతో ఏర్పాటయిన రెండు డీమ్డ్ యూనివర్సిటీలు, ఒక ప్రైవేటు మెడికల్ యూనివర్సిటీ వల్ల రాష్ట్రంలో ప్రభుత్వ కోటాలో 550 ఎంబీబీఎస్ సీట్లకు కోత పడిందని, దీని వల్ల అర్హులైన విద్యార్థులు నష్టపోయారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తెలంగాణకు చెందిన మెడికల్ సీట్లలో కోత జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలకు నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్‌లు ఇవ్వరాదని ప్రకటించిన విషయాన్ని నేషనల్ మెడికల్ కౌన్సిల్ దృష్టికి చక్రపాణి, సుదర్శన్ తీసుకు వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మెడికల్ సీట్ల కుంభకోణంపై తెలంగాణ లోకాయుక్త విచారణ ముగిసేంత వరకు మెడికల్ సీట్ల కేటాయింపు జరగరాదని, అర్హులైన విద్యార్థులకు గత రెండు సంవత్సరాలుగా జరిగిన అన్యాయానికి తగిన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంసీని వీరు అభ్యర్థించారు.

బీసీలపై ప్రేముంటే కాంగ్రెస్‌కు సహకరించాలి

బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సూచన



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వరంగల్ సిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీసీలపై ప్రేముంటే రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సూచించారు. సోమవారం ఆయన హనుమకొండలోని తన నివాసంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు శాసనసభలో బీసీ రిజర్వేషన్ల తీర్మానం చేసి కేంద్రానికి పంపితే.. చట్టబద్ధత కల్పించకుండా ప్రజలను మభ్య పెడుతోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు కాంగ్రెస్‌తో కలిసిరావాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు చురుకుగా సాగుతున్నాయని అన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా పరిష్కారం కోసం తన వద్దకు రావాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని అన్నారు.

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ ఖమ్మం

- ముగిసిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ పోటీలు
- బహుమతులు ప్రదానం చేసిన గట్టు మహేష్‌బాబు



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఖమ్మం జిల్లా అథ్లెట్లకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు



అండర్ 16-బాలికల విభాగంలో టీం చాంపియన్‌షిప్‌సాధించిన ఆతిథ్య హనుమకొండ జిల్లాకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) సింథటిక్‌ట్రాక్‌పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. 33 జిల్లాల, 10 స్పోర్ట్స్ పాఠశాలల నుంచి 1400 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన త్రోస్, జంప్స్, రన్స్‌తో పాటు టీం ఈ వెంట్లలో ఖమ్మం జిల్లా అథ్లెట్లు ముందు నుంచే దూకుడుగా తమ ప్రతిభతో మెరిసి పలు పసిడి, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టి ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు అండర్- 20 బాలబాలికల టీం చాంపియన్‌షిప్ సైతం సాధించారు. అండర్-18 బాలుర విభాగం టీం చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్, బాలికల్లో ఖమ్మం, అండర్-16 బాలురు విభాగంలో రంగారెడ్డి, బాలికల విభాగంలో ఆతిథ్య హనుమకొండ జిల్లా అథ్లెట్లు తమ ప్రతిభతో రాణించారు.జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ఆర్య వైశ్య సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు గట్టు మహేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిని రేపటి గెలుపు కోసం మలుచుకోవాలని క్రీడాకారులకు సూచించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. జూనియర్స్ బాలబాలికల విభాగంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు సెప్టెంబర్ 9 నుంచి 12 వరకు పాండిచ్చేరిలో నిర్వహించనున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. అదే విధంగా మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ విభాగంలో ఆగస్టు 20 నుంచి 24 వరకు చెన్నైలో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్, మడికొండ పోలీస్ స్టేషన్ సీఐ పుల్యాల కిషన్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, పీడీలు మనోజ్‌కుమార్, వాసు, రజినికాంత్, వివిధ జిల్లాలకు చెందిన అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో యూరియాను పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సంద్రాలగూడెంలో సోమవారం నానో యూరియా పిచికారీ చేసే విధానాన్ని ఏడీఏ శ్రీనివాసరావు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. నత్రజని పోషకాన్ని అందించే నానో యూరియా పిచికారీ చేయడం వల్ల మొక్కల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. యూరియా వేయడం వల్ల వర్షానికి కొట్టుకుపోతుందని, నానో యూరియా వాడడం వల్ల మొక్కలపై ఉండి వాటి ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. కూలీల ఖర్చును అధిగమించవచ్చని, సమయమూ ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎస్.తిరుపతిరెడ్డి, కంబాలపల్లి ఏఈవో రంజిత్‌కుమార్, డ్రోన్ పైలెట్ కార్తీక్‌కుమార్, రైతులు దుబ్బ వెంకన్న, అప్పిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో 'ఇంటర్ సిటీ'

హాల్టింగ్ మళ్లీ రద్దు

తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

నెక్కొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్-గుంటూరు, గుంటూరు- సికింద్రాబాద్ (12705/12706) ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌ను నెక్కొండ రైల్వే స్టేషన్‌లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచే అమల్లోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. తొమ్మిది పరిసర మండలాల్లోని ప్రయాణికులకు నెక్కొండ రైల్వే స్టేషన్ అందుబాటులో ఉంటోంది. రైల్వే శాఖకు ప్రతీ రోజు టికెట్ల ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆదాయం వస్తోంది. అలాగే ఒక్క ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ప్రతీ రోజు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తోంది. అయినా ఇంటర్‌సిటీని రద్దు చేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. నెక్కొండ రైల్వే స్టేషన్ సమస్యలను పట్టించుకోవాల్సిన మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ కనీసం స్పందించడంలేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాల కాలంలో నెక్కొండ స్టేషన్‌లో ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌ను రద్దుపర్చడం ఇది మూడోసారి. రైల్వే అధికారుల చర్యతో నెక్కొండ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

21న అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

- 8, 11, 12 తేదీలలో నామినేషన్ల దాఖలు
- 13న పరిశీలన, 14న ఉపసంహరణ
- 21న ఎన్నికల పోలింగ్, ఫలితాల ప్రకటన
- షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల అధికారి ఎం.వాల్య నాయక్



వాల్యనాయక్

వరంగల్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌కు ఈనెల 21న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి ఎం.వాల్యనాయక్ (డిప్యూటీ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా) సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వరంగల్ కాశిబుగ్గలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పది శాఖలు, 6368 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ 1, మహిళా క్యాటగిరిలో 2, ఓపెన్ క్యాటగిరిలో 9 మొత్తం 12 స్థానాలకు రహస్య బాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పోటీ చేయదలిచిన వారు ఈనెల 8, 11, 12 తేదీలలో కాశిబుగ్గ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. 13వ తేదీన పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులకు ఎన్నికల చిహ్నం కేటాయిస్తామన్నారు.

21న మట్టెవాడ, ఎస్‌వి ఎన్‌రోడ్ ఏవీవీ కళాశాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు జరుపుతామని, పోలింగ్ ముగిసిన తరువాత వెంటనే ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఆ తదుపరి మూడు రోజుల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని, దీంతో ఎన్నికల తంతు ముగుస్తుందని ఎన్నికల అధికారి ఎం. వాల్య తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
మంగళవారం 5 ఆగస్టు 2025

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి : ఐటీడీఏ పీవో

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సెక్టోరియల్ అధికారులు సమర్థంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆమె వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 26 మంది గిరిజనులు పీవో వినతులు సమర్పించారు. భూపాలపల్లి, కన్నాయిగూడెం, మహబూబాబాద్ మండలం, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, ములుగు, రేగొండ, వాజేడు తదితర మండలాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను విన్నవించారు. సీఆర్టీ ఉద్యోగావకాశం, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, వికలాంగుల పెన్షన్లు, గిరి వికాసం పథకం, పోడుభూములకు ఉమ్మడి హక్కు పత్రాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో రాజుకుమార్, ఎస్‌వో సురేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

వినతులకు ప్రాధాన్యమివ్వాలి

ప్రజావాణిలో అధికారులతో కలెక్టర్ దివాకర

ములుగు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే వినతులకు ప్రాధాన్యమిస్తూ ఆయా సమస్యలను సత్వరంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 65 వినతులు వచ్చాయి. భూ సమస్యలు 20, గృహనిర్మాణానికి సంబంధించినవి 15, ఉపాధి కల్పనకు సంబంధించినవి 7, పెన్షన్ కోసం 9, ఇతర సమస్యలపై 14 వినతులు వచ్చాయి. వాటిపై అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో దృష్టికి వచ్చే సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌దివాకర

బీజేపీ మహాసంపర్క్ అభియాన్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వెంకటాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడాకుల మల్లేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్‌పార్టీ దారుణంగా మోసం చేసిందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరాచకాలు కొనసాగాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, నాయకులు కారుపోతుల యాదగిరిగౌడ్, కొత్త సురేందర్, భూక్య జవహర్‌లాల్, మండల రమణారెడ్డి, శీలమంతుల రవీంద్రాచారి, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, సూర్యదేవర విశ్వనాథ్, రవిరెడ్డి, లవణ్, ఇమ్మడి రాకేష్, వైదుగుల తిరుపతిరెడ్డి, మేరుగు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వాజేడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న ఘనంగా జరుపుకోవాలని తుడుందెబ్బ మండల ఉపాధ్యక్షుడు చాప లక్ష్మణ్ కోరారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామగ్రామానా నిర్వహించి ఐక్యతను చాటాలన్నారు. ఆదివాసీలకు ఏజెన్సీలో ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికీ అవి అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఆదివాసీల హక్కులను సాధించుకోవాలంటే పోరాటాలు చేయాల్సిందేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తొర్రెం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

వెంకటాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన పంచాయతీ కార్మికుడు విజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ విజయ్ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, పంచాయతీ కార్మికుల రక్షణ కోసం తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట కార్మికులు రంజిత్‌కుమార్, తాటి శ్రీనివాస్, సంతోష్, మధుబాబు, ప్రవీణ్, శాంతమూర్తి, తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి

వెంకటాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాకన్నగూడెం గ్రామం నుంచి వెంకటాపురం మండల కేంద్రం వరకు రహదారి మరమ్మతు పనులకు రూ.100 కోట్ల నిధులను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొసవు రఘుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సీపీఎంపార్టీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా రఘుపతి మాట్లాడుతూ మండలంలో గత రెండేళ్లుగా ఇసుక లారీలు నడుస్తుండడంతో రోడ్లు దెబ్బతిన్నాయని అన్నారు. రాళ్లవాగు బ్రిడ్జితోపాటు కుక్కతోగు వాగు బ్రిడ్జి సైతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈవాగులపై నూతనంగా బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6వతేదీన నిర్వహించే మండల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్యానం వాసు, నాయకుల చిట్టెం ఆదినారాయణ, కుమ్మరి శ్రీను, రమణయ్య, నిర్మల,దేవి, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల బైక్ ర్యాలీ

వెంకటాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అమరుల యాదిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో కల్లుగీత కార్మికులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు కోటగిరి సురేందర్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించగా గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి తాళ్లపాడు సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 2నుంచి 18 వరకు కల్లుగీత అమరులను గుర్తుచేసుకుంటూ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహిస్తామని అన్నారు. కల్లుగీత అమరుల స్ఫూర్తితోనే కల్లుగీత కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పులి రమేష్, గునిగంటి శోభన్, దొమ్మటి రాజసమ్మయ్య, మండల నాయకులు వెంకన్న, శ్రీకాంత్, వెంకటమల్లయ్య, మునిగాల రాజు, తడుక భిక్షపతి, గాజర్ల సతీష్, దేశిని రాజు, మునిగాల వెంకటేష్, శివ, తడుక ఐలయ్య, మండ భిక్షపతి, సాంబయ్య, గుర్రం రజనికాంత్ తదితరులు ల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయాలు

వాజేడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన సుగంధపు జ్యోతిప్రసాద్ సోమవారం కొంగాలలో మిర్చి నారు మడిలో పని చేస్తుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. కుటుంబ సభ్యులు అతడిని వాజేడు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తీసుకెళ్లారు.

కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

(5వ పేజీ తరువాయి)

తరలించారు. ఈ క్రమంలో విషయం ఆ నోటా ఈ నోటా బయటికి పొక్కింది. సమాచారం అందుకున్న అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి హాస్టల్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి నేరుగా కొర్కిశాలలోని కేజీబీవీ పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే విద్యార్థినులు, సిబ్బందిని అడిగి పూర్తి వివరాలు సేకరించారు. ఇటీవల పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని హెచ్చరించినా సిబ్బంది నిర్లక్ష్యంతోనే పునరావృతమైందని, బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇవే కాకుండా వసతి గృహాల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం, చలికాలం రానున్న నేపథ్యంలో విద్యార్థినులకు అవసరమైన గ్రీజర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు విద్యార్థినులకు బెడ్లు సైతం మంజూరుచేయనున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను తీరుస్తానని భరోసా ఇచ్చారు. హాస్టల్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తనకు సమాచారం ఇస్తే వెంటనే నెరవేరుస్తానని, అధికారులు విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ రవి, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం : బీఆర్ఎస్

విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీఆర్ఎస్ నేతలతు విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మొగుళ్లపల్లి కేజీబీవీ విద్యార్థినులను చిట్యాల, మొగుళ్లపల్లి బీఆర్ఎస్ నాయకులు సోమవారం రాత్రి పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా చిట్యాల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే తరచుగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని విమర్శించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కొడారి రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ల సురేష్, నాయకులు బైరం భద్రయ్య, వీరస్వామి, రాజు, రమణాచారి, శ్రీనివాస్, సరోజన, శ్రీదేవీ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల మేరకే షెడ్డును కూల్చాం

మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకే కూరాకుల ఓదెలుకు చెందిన పశువుల పాకను కూల్చివేశామని భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి 8, ఏప్రిల్ 15న మండల విద్యాశాఖాధికారి, మంజూర్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో పాటు మేకల రమేష్ అనే వ్యక్తి తమకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో పశువులు సంచారం చేస్తున్నాయని, విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. అలాగే పక్కనే ఉన్న వెంచర్ యజమానులు అదే స్థలంలో 30ఫీట్ల రోడ్డు కూడా మ్యాప్‌లో ఉందని, దాని పనులు పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓదెలుకు నోటీసులు అందించి, అనంతరం షెడ్డును కూల్చివేసినట్టు వివరించారు.

గడప గడపకూ కేంద్ర సంక్షేమ పథకాలు

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు


చిట్యాలలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

చిట్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని గడపగడపకూ చేరుకుని కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు అన్నారు. మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. చిరు వ్యాపారులకు చేయూతనిచ్చేందుకు ముద్ర లోన్, గ్రామాల్లో ఎల్ఈడీ విద్యుద్దీపాలు, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు ఐదు వందే భారత్ రైళ్లు, ఉజ్వల యోజన పథకంలో పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, సమ్మక్క, సారలమ్మ గిరిజన యూనివర్సిటీ, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునఃప్రారంభం, యువతకు ఉద్యోగ కల్పన లాంటి ఎన్నో పథకాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్, నాయకులు చెక్క నర్సయ్య, వెంకటరాజవీరు, మైదం శ్రీకాంత్, సుధగాని శ్రీనివాస్, అశోక్, రాజు, సంపత్, ప్రభాకర్, రాజేందర్, కుమార్, కిషోర్ పాల్గొన్నారు.

చిట్యాలలో 'బాలింత దర్శనం'

చిట్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో బాలింత దర్శనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు బాలింత గుర్రం స్రవంతికి పండ్లు, ఆకుకూరలు, శిశువుకు దుస్తులు తీసుకుని ఆమె ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు అందించారు. బాలింత, శిశువు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని, బాబుకు ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టించాలని, ఆతర్వాత బాలామృతం తినిపించాలని సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, జ్యోతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర పరిశీలన

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వరిపొలాల్లో దర్శనమిచ్చారు. నాటు వేసే పద్ధతిని స్వయంగా పరిశీలించారు. మండలంలోని సూరారం ఎస్టీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు హరీశ్ క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులను పంట పొలం వద్దకు తీసుకెళ్లారు. పరిసరాల విజ్ఞానం పుస్తకంలోని 'మనం - మన పంటలు' అనే పాఠ్యాంశంపై అవగాహన కల్పించేందుకు పాఠశాల పక్కనే ఉన్న పొలంలోకి తీసుకెళ్లారు. విద్యార్థులకు బడిలోనే కాకుండా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం వల్ల వారిలో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు సత్వరంగా స్పందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ప్రజావాణి వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వినతులతోపాటు ప్రజాభవన్ హైదారాబాద్ నుంచి వచ్చిన వాటిని వచ్చే సోమవారంలోపు పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి వినతినీ పరిశీలించి అర్జీదారులకు సమాధానం ఇవ్వాలన్నారు. ప్రతి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజావాణిలో 90 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

సమష్టి కృషితోనే నీతి ఆయోగ్ అవార్డు

సమష్టి కృషితోనే సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధించామని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. జిల్లాకు సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో అవార్డు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మను అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ అవార్డు రావడం జిల్లాకు గొప్ప వరం అన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ పాస్ స్టాక్, స్టాక్ రిజిష్టరు నిల్వలు, బిల్లు బుక్కులు పరిశీలించారు. అనంతరం ఓ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పంటల దశలనుబట్టి యూరియా సరఫరా అవుతుందన్నారు. యూరియా కావాల్సిన వారు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డుతో సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకుడు రమేష్, తహసీల్దర్ శ్వేత, వ్యవసాయ విస్తరణ అధికారులు గోవర్ధన్, మాళవిక తదితరులు పాల్గొన్నారు

వినతిపత్రం సమర్పించిన నిర్వాసితులు

మల్హర్, (ఆంధ్రజ్యోతి) : జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో భాగంగా తాడిచర్ల బ్లాక్-1 ఓసీపీ పరిధిలోని డేంజర్ జోన్‌లోని ఇళ్లను సేకరించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని ప్రజావాణి కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన నిర్వాసితులు తాండ్ర మల్లేష్, కేశారపు నరేష్ కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఇళ్ల సేకరణకు సంబంధించిన ప్రక్రియను ఈ నెల 31 వరకు ప్రారంభించాలని, లేని పక్షంలో సెప్టెంబరులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపడతామని అన్నారు. ఓసీపీ బొగ్గును కేటీపీపీకి వెళ్లకుండా లారీలను అడ్డుకుంటామన్నారు.


కన్నెపల్లి పంప్‌హౌజ్ గేటు వద్ద బీర్ఎస్ శ్రేణులు

కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయాలి..

(5వ పేజీ తరువాయి)

సాగుకు నీరందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగి మరమ్మతులకు వచ్చినా కన్నెపల్లి పంప్‌హౌస్‌లో నీటి లభ్యత ఉందని, వ్యవసాయ అవసరాల రీత్యా నీటిని విడుదల చేయొచ్చని తెలిపారు. తాము ఎన్‌డీఎస్ఏ అధికారులతో మాట్లాడామని, పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేయొచ్చని వారు చెప్పారని తెలిపారు. కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయకపోతే వారం రోజుల్లోగా తామే ఆ పనిచేస్తామని హెచ్చరించారు.

నీళ్లు పుష్కలంగా ఉన్నాయి : బోయినపల్లి

బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని విమర్శించారు. ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ బ్యారేజీ వద్ద పంప్‌హౌస్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఉదయం 9.30 గంటలకు 93.76 మీటర్ల నీటిమట్టం ఉందన్నారు. లక్షా 40 వేల క్యూసెక్కుల నీళ్లు ఉదయం 9.30 గంటలకు ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఆ నీటిని బ్రహ్మాండంగా వినియోగించుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు చెప్పినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు నీళ్లు ఎత్తిపోశామన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్లు తెచ్చామన్నారు. ఇయ్యాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, సింగిల్‌విండో అధ్యక్షులు రమణరావు, రామకృష్ణరావు, జగిత్యాల జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత, మాజీ ఎంపీపీ వసంత, నేతలు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, రమేష్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి పర్యటన

కాటారం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నియమించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి ఐఏఎస్ సోమవారం పర్యటించారు. బొప్పారం గ్రామంలో ఇటీవల డెంగీ పాజిటివ్ వచ్చిన అర్హ అనే చిన్నారి ఇంటిని సందర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వానాకాలంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్థులకు సూచించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. పేషంట్లతో మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వైద్యురాలు హారిక, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై పరికరాలు

మల్హర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై 131 పరికరాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీజ సోమవారం తెలిపారు. రోటవేటర్స్, బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ ఆపరేటర్స్ స్ప్రేయర్స్, బ్రష్ కట్టర్స్, వరి గట్టు వేసే మిషన్, విత్తనం, ఎరువులు వేసే మిషన్ పవర్ టిల్లర్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సన్మానం

కాటారం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్యను సోమవారం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్ది నవీన్ ఆధ్వర్యంలో నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ సన్మానం చేశారు. శాలువాలతో సత్కరించి మెమొంటో అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్, మండలఅధ్యక్షుడు మద్ది నవీన్, సంఘ బాధ్యులు రమేష్, నందకిషోర్, అల్లాడి చంద్రమౌళి, అనంతుల శ్రీనివాస్, బచ్చు ప్రకాష్, ఎంఎల్ఎన్ మూర్తి, ముక్క శ్రీనివాస్, కముటాల రవి, సంపత్, తిరుమల్, సంతోష్, శ్రీమన్ తదితరులు పాల్గొన్నారు.


సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సిల్వర్‌జూబ్లీ వేడుకలు

రేగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని భారతి ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి 2000-2001 బ్యాచ్ విద్యార్థులు సిల్వర్‌జూబ్లీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో స్నేహితులతో కలిసి ఆట పాటలతో అలరించారు.తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను శాలువా కప్పి సన్మానించారు.